# ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లకు మార్గం సుగమం

- మూడు అంశాల ఫైలుపై సీఎం సంతకం
- ఒకట్రెండు రోజుల్లో సర్కారు ఉత్తర్వులు.. వెంటనే నోటిఫికేషన్
- ఇకపై రూల్6 ప్రకారమే పోస్టుల భర్తీ
- అన్ని పరీక్షలకూ ప్రిలిమ్స్‌పై సర్కారు సానుకూల స్పందన

**సాక్షి, హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్ల జారీకి లైన్ క్లియర్ అయ్యింది. దీనికి సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతకం చేసినట్లు సమాచారం వచ్చిందని ఏపీపీఎస్సీ వర్గాలు వివరించాయి. ఏపీపీఎస్సీ ద్వారా 4 వేల పోస్టులు భర్తీ చేయడానికి ప్రభుత్వం గతనెలలో ఉత్తర్వులిచ్చింది. ఇందులో గ్రూప్2లోని ఎగ్జిక్యూటివ్ పోస్టులను గ్రూప్1 బీ కేటగిరీగా మార్చి భర్తీ చేయాలని ముందు భావించారు. దీనిపై నిరుద్యోగుల నుంచి ఆందోళనలు వ్యక్తమవడంతోపాటు ఏపీపీఎస్సీకి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతులు వెల్లువెత్తాయి. చివరకు అధికారులు పాత విధానంలోనే పోస్టులు భర్తీచేయాలని నిర్ణయించారు. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ఫైలుపై సీఎం సంతకం చేశారని వివరించారు.

**రూల్ 7 తొలగింపునకూ ఓకే**

ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో పరస్పర విరుద్ధంగా ఉన్న రూల్ 6, రూల్ 7ల విషయంలోనూ ఏపీపీఎస్సీ ప్రతిపాదనలకు ప్రభుత్వం అనుమతించింది. రూల్6 ప్రకారం క్యారీ ఫార్వర్డ్ (మిగిలిపోయిన సీట్లు తదుపరి నోటిఫికేషన్లోకి మళ్లింపు) చేయాలని చెబుతోంది. రూల్ 7 మాత్రం లెఫ్ట్ ఓవర్ మెరిట్ విధానంలో మిగిలిన ఖాళీలను మెరిట్ జాబితాలోని తదుపరి స్థానాల్లోని వారితో భర్తీచేయాలని సూచిస్తోంది. దీంతో రూల్ 7ను రద్దుచేయాలని ఇటీవల ఏపీపీఎస్సీ రాసిన లేఖకు ప్రభుత్వం అంగీకరించింది. ఇకపై రూల్ 6 ప్రకారమే పోస్టులు భర్తీ చేస్తారు. అలాగే అన్ని గ్రూపుల్లోనూ ప్రిలిమ్స్ నిర్వహించడంపైనా ఏపీపీఎస్సీ వినతికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని కమిషన్ ఛైర్మన్ ఉదయభాస్కర్ 'సాక్షి'కి తెలిపారు. వీటిపై ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వం ఉత్తర్వులు వచ్చే అవకాశముందన్నారు. అవి రాగానే రోస్టర్, జోనల్ కేటగిరీల వివరాలు అందిన మేరకు నోటిఫికేషన్లు ఇస్తామని వివరించారు.

## వెబ్‌సైట్లో గ్రూప్1 సవరించిన జాబితా

2003 గ్రూప్1 పోస్టులకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును మేరకు ఏపీపీఎస్సీ ఇటీవల 69 పోస్టులకు అభ్యర్థుల జాబితా ప్రకటించింది. అయితే అందులో పొరపాట్లు దొర్లినట్లు అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు రావడంతో ఆ జాబితాను సవరించింది. సవరించిన జాబితాను శుక్రవారం వెబ్‌సైట్లో అప్‌లోడ్ చేశారు. www.psc.ap.gov.in వెబ్‌సైట్లో ఈ జాబితాను అభ్యర్థులు చూసుకోవచ్చని ఏపీపీఎస్సీ ఒక ప్రకటనలో పేర్కొంది.